

డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, ఆగస్టు 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు శనివారం విడుదల య్యాయి. 2020, 2021, 2022 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఈ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. డిగ్రీలోని అన్ని కోర్సులకు కలిపి 6,011 మంది విద్యార్థులు 12,597 సబ్జెక్ట్ పేపర్లు రాయగా, 7,416 సబ్జెక్ట్‌లు ఉత్తీర్ణులై 58.87 శాతం నమోదైంది.



వైసీపీలో దువ్వాడ చిచ్చు

- కుటుంబ వ్యవహారంతో మరింతగా దిగజారిన పార్టీ
- అధిష్ఠానం నుంచి కూడా మద్దతు కరువు
- తొలి నుంచి దుందుడుకు.. నోటి దురుసుతనమే
- తప్పిదాన్ని మంత్రి అచ్చెన్నపై నెట్టేసే యత్నం



దువ్వాడ శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటిపోరు వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలన సృష్టిస్తోంది. గత రెండు రోజులుగా దువ్వాడ, ఆయన సతీమణి వాణి మధ్య తీవ్ర వివాదం రేగుతోంది. దువ్వాడకు వ్యతిరేకంగా భార్య వాణితో పాటు ఇద్దరు కుమార్తెలు చేస్తున్న నిరసనలు, ఆరోపణలు, బైఠాయింపులతో టెక్కలిలో ఉద్రిక్తత నెలకొంది. అయితే, దువ్వాడ వ్యవహారం వైసీపీలో చిచ్చు రేపుతోంది. ఇప్పటికే ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఘోర ఓటమిని చవిచూసిన ఆ పార్టీకి.. శ్రీను వ్యవహారం తలనొప్పిగా మారింది. మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు వైసీపీ పరిస్థితి మారింది. ప్రతిపక్ష నాయకులు గానీ, ఇతరులు గానీ ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేస్తే అటువంటి విషయాలకు రాజకీయరంగు పులిమేసి ఎంచక్కా తప్పించుకోవచ్చు. కానీ, ఎమ్మెల్సీ దువ్వాడను తూర్పారబడుతుంది ఆయన సతీమణి వాణి, కుమార్తెలు హైందవి, నవీన కావడంతో ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితి వైసీపీలో నెలకొంది. ప్రజాప్రతినిధిగా ఉంటూ మరో మహిళతో ఉంటున్నారని, ట్రాప్‌కు గురై ఆమెతో జీవిస్తున్నారని, తమ పిల్లల భవిష్యత్తు గురించి తేల్చాలంటూ భార్య వాణి పట్టుబట్టి నిరసనకు దిగారు. దీంతో రెండురోజులు మౌనం దాల్చిన దువ్వాడ శ్రీను ఎట్టకేలకు ఈ వ్యవహారంపై స్పందించారు. తన తప్పేమీ లేదని, తన భార్యతో పడలేకునాన్నని, ఆమెకు విడాకులు ఇస్తున్నానని వెల్లడించారు. అప్పట్లో ఎన్టీఆర్, పవన్‌కల్యాణ్ వంటివారు ఇలా పడలేకనే మరో పెళ్లిళ్లు చేసుకున్నారని మీడియా సమావేశంలో వెల్లడించారు. పనిలో పనిగా ఈ వ్యవహారాన్ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిపై నెట్టేందుకు యత్నించారు.

ఆది నుంచీ వివాదాలే

టెక్కలి నియోజకవర్గ వైసీపీ క్రియాశీలక నాయకుడు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారశైలి ఆది నుంచీ వివాదస్పదమే. దూకుడు స్వభావం, నోటిదురుసు, వివాదస్పద నిర్ణయాలతో నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. దీని మూలంగా ఆయన ప్రత్యక్ష ఎన్నికల ద్వారా టెక్కలి జడ్పీటీసీ మినహా మరే ఇతర పదవులను అందుకోలేకపోయారు. రాజకీయంగా తొలుత కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీలో చేరారు. చివరకు వైసీపీ పంచన చేరారు. 2000 సంవత్సరంలో రాజకీయాల్లోకి వచ్చిన దువ్వాడ టెక్కలి జడ్పీటీసీగా గెలుపొంది కొన్నాళ్లపాటు జిల్లాపరిషత్ ఉపాధ్యక్ష పదవి కూడా అందుకున్నారు. ఆ సమయంలో స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికల్లో ఆయన పార్టీకి దిక్కరించి స్వతంత్ర అభ్యర్థి గొర్లె హరిబాబుకు సహకరించడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి కొన్నాళ్లపాటు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్మాన ప్రసాదరావుతో పాటు కూడా

పార్టీ మారే యోచనలో కేడర్

దువ్వాడ వ్యవహారాన్ని కారణంగా చూపి వైసీపీ ద్వితీయస్థాయి నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంటీసీలు, సర్పంచ్‌లు పార్టీమారే ఆలోచన చేస్తున్నారు. అధిష్ఠానంతో పాటు పార్టీ నాయకుల నుంచి ఆయనకు మద్దతు కరువైంది. ఒక్కరు కూడా దువ్వాడకు అనుకూలంగా మాట్లాడడం లేదు. ఎవరు చెప్పినా దువ్వాడ వినే స్థితిలో ఉండరన్నది సీనియర్ నాయకుల భావన. అతని నోటి దురుసుతో తాము బాధపడినవారిమేనని, ఇప్పుడు అతని భార్య, పిల్లలు భరించలేక బయటకు వచ్చారని వైసీపీలో చర్చ నడుస్తోంది. ఇలాంటి వారివల్ల పార్టీ పరిస్థితి మరింత దిగజారిపోతుందని కేడర్ ఆవేదన చెందుతుంది. పైగా నిన్నటి వరకు నీతిసూత్రాలు వెల్లడించిన దువ్వాడ ఇప్పుడు మరోమహిళతో ఉంటూ భార్య, పిల్లలతోనే మాటలు కాస్తున్న పరిస్థితికి దిగజారిపోయారు.



శుక్రవారం అర్ధరాత్రి దాటాక కూడా దువ్వాడ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న భార్య వాణి, కుమార్తెలు

ఆయన సఖ్యతగా వ్యవహరించలేదు. కింజరాపు, ధర్మానలపై కేడీ బ్రదర్స్ అని విమర్శలు గుప్పించారు. టెక్కలి ఎమ్మెల్యేగా పనిచేసిన హనుమంతు అప్పయ్యదొరని దొంగని, అప్పట్లో డీసీసీ అధ్యక్షురాలుగా వ్యహరించిన బొడ్డేపల్లి సత్యవతిని స్వార్థపరురాలని అదే పార్టీలో ఉంటూ వారిపై విమర్శలు గుప్పించారు. స్వపక్షంలో విపక్షంలా వారితో వివాదాన్ని కొనసాగించారు. దువ్వాడ వ్యవహరించిన తీరు అప్పుడు, ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. 2019-24 మధ్యకాలంలో వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు కూడా మంత్రులుగా వ్యవహరించిన ధర్మాన సోదరులతో గానీ, మరో మంత్రి సీదిరి అప్పలరాజుతో గానీ ఆయనకు ఏనాడూ సఖ్యత లేదు. కాకరాపల్లి థర్మల్ పవర్‌ప్లాంట్ వ్యతిరేకిస్తూ ఆందోళనకారులతో కలిసి ఉద్యమాలు చేపట్టడంతో ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. అలాగే ఒడిశాలో ఆయన నిర్వహించిన గ్రానైట్ క్వారీకి సంబంధించి అధికారుల సంతకాలను ఫోర్జరీ చేయడంతో 50 రోజుల పాటు ఆ రాష్ట్రంలో జైలు జీవితం గడిపారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును ఏకవచనంతో సంబోధించి దుర్భాషలాడు తుండడంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దువ్వాడకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు. అది దన్ను చూసుకొని దువ్వాడ మరింత రెచ్చిపోయి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులపై విచ్చలవిడిగా అక్రమకేసులు బనాయించారు. కాగా, 2014 ఎన్నికల్లో దువ్వాడ శ్రీను టెక్కలి అసెంబ్లీకి వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో వైసీపీ నుంచి శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి పోటీచేసి ఓడిపోయారు. 2024లో మళ్లీ టెక్కలి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. చివరకు పార్టీని కూడా పతనం అంచున నిలబెట్టేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తర్వాత ఆ రీతిలో కేసులు నమోదైంది దువ్వాడ పైనే.

నీ వ్యాఖ్యలు.. నీకే వర్తించవా?

- దువ్వాడపై ట్రోలింగ్

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నోటి దురుసుపై సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్ అవుతోంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన విమర్శలు.. ఇప్పుడు ఆయనకే వర్తిస్తూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. దువ్వాడ శ్రీను గతంలో ప్రతిపక్ష నాయకులపై నోటికొచ్చినట్లు మాట్లాడారు. బూతులతో విరుచుకుపడ్డారు. నారా లోకేష్, పవన్ కల్యాణ్, చంద్రబాబు, అచ్చెన్నాయుడులపైనా విమర్శలు చేశారు. అందరినీ ఏకవచనంతో సంబోధించారు. మగాడు ఎలా ఉండాలన్నదీ నీతిసూత్రాలు చెప్పారు. ఆ వ్యాఖ్యలపై ఇప్పుడు దువ్వాడను నెటిజన్లు నిలదీస్తున్నారు.

●అప్పట్లో జనసేనానిపై దువ్వాడ చేసిన వ్యాఖ్యలు ఇవి "ఒక్కో మగాడు కొన్ని వేలమందిని పెళ్లి చేసుకోగలడు. కానీ పద్ధతీ, సంస్కారం, హిందూమతం వంటివి అడ్డువస్తాయి. ఓ తెలుగువాడిగా ఏకపత్నీవ్రతమే మన మతం. ఒకే స్త్రీనే పెళ్లాడి.. ఆ స్త్రీతోనే జీవితం పూర్తిచేయడం మన సంప్రదాయం. అటువంటి సంప్రదాయానికి తూట్లు పొడిచిన నీచుడు పవన్‌కల్యాణ్" అంటూ దువ్వాడ శ్రీను అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియా ఛానెల్‌లో తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు దువ్వాడ శ్రీను మరో మహిళతో ఉంటున్నారని.. తనను, తన పిల్లల భవిష్యత్తుగురించి పట్టించుకోవడం లేదని ఆయన సతీమణి దువ్వాడ వాణి గడచిన రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఆయన వైఖరిని బహిరంగంగానే భార్య, పిల్లలు ఎండగడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలో ఉన్నప్పుడు దువ్వాడ శ్రీను చేసిన విమర్శల వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వాటిని దువ్వాడకే ఆపాదిస్తూ.. నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు.

వాణికి విడాకులు ఇస్తున్నా..

- దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: 'నా 30 ఏళ్ల వైవాహిక జీవితంలో భార్యగా ఉన్న దువ్వాడ వాణికి విడాకులు ఇవ్వడానికి నిర్ణయిం చుకున్నా' అని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నా చుట్టూ కత్తులే ఉన్నాయి. నాకు అందరూ శత్రువులే. నా కుటుంబంతో పాటు రాజకీయ ప్రత్యర్థుల వలన నేను బలవుతున్నా. నాకు వ్యతిరేకంగా కుటుంబ సభ్యులు ఉన్నారు. నా ఓటమికి వారే కారణం. నా మామ సంపతిరావు రాఘవరావు పచ్చ చొక్కాల పక్కన ఉండి టీడీపీకి ఓట్లు వేయించాడు. నా భార్య, కుమార్తెలు నాపై దాడి చేయడానికి నా ఇంటికి వచ్చారు. ఈ విషయం పోలీసులకు తెలియజేసినా స్పందించడం లేదు. ఆత్మరక్షణ కోసం పోలీసులకు రెండు నెలలుగా వెపన్ అడుగుతున్నా ఇవ్వడం లేదు. నేను ఏ పరిస్థితిలో ఉన్నా కుమార్తెలను గౌరవంగా చూస్తా. కానీ, వారు రెండురోజులుగా మందీ మార్బలంతో కారంగుండ, రాడ్లు వైర్లు , కటింగ్ బ్లేడ్లతో నాపై దాడి చేసేందుకు వచ్చారు. ఇది సరికాదు. నా భార్య వాణి ఎన్నో అవమానాలకు గురి చేసింది. ఆమెతో కలిసి ఉండలేని పరిస్థితి నెలకొంది. అందుకే విడాకులు ఇస్తున్నా. ఈ ఎపిసోడ్ వెనుక మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హస్తం ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లో నాపై రెడ్‌బుక్ తెరవకుండా, ఈ రకంగా హింసిస్తున్నారు. నాకు ఏదైనా జరిగితే అచ్చెన్నాయుడు బాధ్యత వహించాల్సి వస్తుంది. దివ్వల మాధురితో లేనిపోని సంబంధాలు సృష్టించి నా పరువు తీశారు. నా భార్య విలువ లేకుండా చేసింది. భోజనం కూడా సరిగ్గా పెట్టలేదు. మాధురి ఆత్మహత్య చేసుకోబోగా నేను వారించి ఆపాను. నాకు అండగా ఉన్న ఆమెతో రెండేళ్లుగా కలిసి తిరుగుతున్నా' అని దువ్వాడ తెలిపారు.

దువ్వాడ మాపై దాడికి ప్రయత్నించాడు: వాణి

'రెండేళ్లుగా నా భర్త దువ్వాడ శ్రీనివాస్ చేస్తున్న పనుల మూలంగా కుటుంబమంతా రోడ్డున పడి ఇబ్బందులు పడుతున్నాం.' అని టెక్కలి జడ్పీటీసీ సభ్యురాలు, ఆయన భార్య దువ్వాడ వాణి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'దువ్వాడ తీరుతో మా కుటుంబం, పిల్లలు చాలా బాధ పడుతు న్నారు. ఎంతో పేరున్న మా కుటుంబాన్ని పూర్తిగా డ్యామేజ్ చేశాడు. మరో మహిళ ట్రాప్‌లో పడి లేనిపోని కబుర్లు చెబుతున్నాడు. ఆయన ఉండే నివాసం వద్దకు నేను పిల్లలతో కలిసి వెళ్తే మాపై రాడ్డుతో దాడిచేయడానికి వచ్చాడు.' అని అన్నారు. దువ్వాడ కుమార్తె హైందవి మాట్లాడుతూ.. తమ కుటుంబం విడిపోవడానికి కారణం దువ్వాడ సోదరుడు బాబా అని ఆరోపించారు.

డెంగ్యూ కలకలం

- సుబ్బపేటలో ఒకేరోజు ఐదుగురికి లక్షణాలు
- శ్రీకాకుళం రిమ్స్‌కు తరలింపు
- ఆందోళనలో గ్రామస్థులు





శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న డెంగ్యూ జ్వర పీడితులు

సరుబుజ్జిలి, ఆగస్టు 10: మండలంలోని ఇసుకలపాలెం పంచాయతీ సుబ్బపేట గ్రామంలో శనివారం డెంగ్యూ కలకలం రేగింది. ఒకేరోజు గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తుల్లో డెంగ్యూ లక్షణాలు కనిపించడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. తొలుత పైల సూర్యం అనే వ్యక్తికి డెంగ్యూ నిర్ధారణ కావడంతో స్థానిక వైద్య సిబ్బంది ఆయన్ను 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలో శిబిరం నిర్వహించారు. పలువురు రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించగా పోలిపల్లి చిన్నమ్మడు, యారబాటి నాగేశ్వరరావు, మక్క సరస్వతితో పాటు 12 ఏళ్ల బాలిక యారపాటి గాయత్రిలో డెంగ్యూ లక్షణాలు కనిపించాయి. వెంటనే వారిని కూడా శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు. వీరే కాకుండా మరికొంతమంది కూడా విషజ్వరాలతో మంచాన పడ్డారని గ్రామస్థులు తెలిపారు.

పారిశుధ్య లోపమే కారణం..

సుబ్బపేటలో డయేరియా ప్రబలడానికి పారిశుధ్య లోపమే కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ వీధుల్లో ఎటు చూసినా చెత్తాచెదారమే దర్శనమిస్తుందని, కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో కొంతమంది వ్యక్తులు పశువులు శాలలు ఏర్పాటు చేశారని, దీనివల్ల దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే, వీధుల్లోని రోడ్లపై కొందరు పశువులను కడుతుండడంతో ఆ ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేసి స్వచ్ఛభారత్ కార్యక్రమంతో పాటు పారిశుధ్య పక్షోత్సవాలు, వారోత్సవాలు నిర్వహిస్తున్నా మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రిమ్స్‌లో ప్రత్యేక డయేరియా వార్డు

అరసవల్లి: శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో డయేరియా రోగుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల కిందట జి.సిగడాం మండలం మెట్టవలస గ్రామంలో డయేరియా ప్రబలి తిప్పడు అనే వ్యక్తి మృతి చెందాడు. మరో ఏడుగురు రిమ్స్‌లో చేరారు. ఈ నేపథ్యంలో డయేరియా కేసుల కోసం రిమ్స్‌లో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు ఆర్ఎంవో డాక్టర్ సుభాషిణి తెలిపారు. ఈ వార్డులో 24 గంటలు సేవలు అందించడానికి మూడు షిఫ్టుల్లో స్టాఫ్ నర్సులు, వైద్యులు, సిబ్బందితో పాటు అన్ని రకాల మందులు సిద్ధంగా ఉంటాయని చెప్పారు.



ప్రత్యేక డయేరియా వార్డులో ఏర్పాటు చేసిన బెడ్లు

రాష్ట్రంలో వెలుగులు తెస్తున్నాం

- త్వరలో అందరి సమస్యలు పరిష్కరిస్తాం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నిమ్మాడలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 10: 'వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అంధకారంలో కూరుకుపోయింది. దోపిడీలు, అప్పులు, అరాచకాలతో రాష్ట్ర భ్రష్టుపట్టుకుపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిస్థితులను చక్కదిద్దుతూ రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే వెలుగులు తెస్తున్నామని' వ్యవసాయ, సహకార, పశువసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం నిమ్మాడలో తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బారు నిర్వహించారు. ప్రజలు, కార్యకర్తల నుంచి పలు వినతులు స్వీకరించారు. అందరి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, సంయమనం పాటించాలని సూచించారు. నమ్ముకున్న ప్రతి కార్యకర్తకూ న్యాయం చేస్తానని, గ్రామాల అభివృద్ధికి అందరం కలిసి కట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు, కార్యకర్తలు, గ్రామ, మండల స్థాయి నాయకులు సహకరించాలని కోరారు. టెక్కలి నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లా నలుమూల నుంచి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సమస్యలపై వినతులు అందజేశారు.

పేలిన నాటుబాంబు

- మేకకు గాయాలు

కోటబొమ్మాళి, ఆగస్టు 10: నాటుబాంబు పేలడంతో ఓ మేకకు తీవ్ర గాయాలైన ఘటన కోటబొమ్మాళి మండలం శ్రీపురంలో జరిగింది. తర్లిపేట కొండపై అడవి పందుల కోసం వేటగాళ్లు నాటు బాంబులు అమర్చారు. అయితే శనివారం మధ్యాహ్నం శ్రీపురం గ్రామానికి చెందిన బొడ్డు రమణయ్య అనే రైతు మేత కోసం తన మేకల మందను తోలుకొని కొండపైకి వెళ్లాడు. అక్కడ మందలోని ఒక మేక వేటగాళ్లు అమర్చిన నాటుబాంబును నమలటంతో అది పెద్ద శబ్దంతో పేలింది. దీంతో మేక కింది దవడ పూర్తిగా ఛిద్రమైంది. వెంటనే మేకను స్థానిక పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ వద్దకు చికిత్స కోసం తీసుకురాగా.. మేకకు చికిత్స చేసే అవకాశం లేదని, దవడ పూర్తిగా చీలిపోయిందని చెప్పారు. మరో 24 గంటలు మాత్రమే అది బతుకుతుందని స్పష్టం చేశారు. కాగా, ఈ కొండపై మనుషులు తిరుగుతుంటారని, ఎవరి కాలు కింద బాంబు పడినా తీవ్ర ప్రమాదం జరుగుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. పోలీసులు ఇలాంటి బాంబులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.



ఛిద్రమైన మేక దవడ

'సుజలధార'పై నిర్లక్ష్యం

- ఐదేళ్ల పాటు పట్టించుకోని వైసీపీ సర్కారు
- నిర్వహణ లేక మూతపడిన ప్లాంట్లు
- శుద్ధజలాలు అందక ప్రజలు ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 10: ప్రజలకు శుద్ధ జలాలను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాటు నిర్వహణను గాలికొదిలేసింది. ఫలితంగా చాలాచోట్ల సుజలధార ప్లాంట్లు మూతపడ్డాయి. దీంతో శుద్ధ జలాలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులకు తాగునీరు కలుషితం కావడం ఒక కారణమని అధ్యయనాలు తేల్చాయి. దీంతో ఉద్దానం ప్రజలకు శుద్ధ జలాలను అందించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని ప్రారంభించింది. రూ.14 కోట్ల వ్యయంతో పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురంలో మండలానికి ఒకటి చొప్పున మదర్ ప్లాంట్లను నిర్మించారు. ఏడు మండలాల్లోని 135 గ్రామాల్లో సరఫరా కేంద్రాలను పెట్టారు. మదర్ ప్లాంట్ల నుంచి సరఫరా కేంద్రాలకు శుద్ధ జలాలను తరలించేందుకు స్టీల్ కంటైనర్లతో ట్రాక్టర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. 20 లీటర్ల నీటిని రూ.2కే అందించేవారు. కొన్నాళ్ల పాటు ఈ ప్లాంట్లు బాగానే పనిచేశాయి. కానీ, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహణను గాలికొదిలేసింది. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం అంటూ హడావుడి చేసి ఈ ప్లాంట్లను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో రెండు నియోజకవర్గాల్లో సగానికిపైగా సరఫరా కేంద్రాలు మూతపడుతున్నాయి. ట్యాంకర్లు సైతం తరచూ మొరాయిస్తున్నాయి. దీంతో శుద్ధజలాలు అందక ప్రజలు బోర్లు, బావుల నీరు తాగి అస్వస్థతకు గురవుతున్నారు.



ఇచ్ఛాపురంలో మూలకు చేరిన ఎన్టీఆర్ సుజలధార ప్లాంట్

సమగ్ర మంచినీటి పథకం అందుబాటులోకి వచ్చేనా?

ఎన్నికలు సమీపించడంతో గత ఏడాది డిసెంబరులో అప్పటి సీఎం జగన్ కంచిలి మండలంలో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకాన్ని హడావుడిగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. కానీ, ఇంకా ఆ పథకం పనులు కొలిక్కి రాలేదు. చాలా గ్రామాలకు ఇంతవరకూ పైపులైన్లు వేయలేదు. ఆ పథకం అందుబాటులోకి వచ్చింది కదా అని ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. కానీ, ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం అందుబాటులోకి వచ్చేసరికి దాదాపు ఏడాది పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 20 లీటర్ల క్యాన్ ధర రూ.2లు ఉండగా.. నిర్వహణ వ్యయం పేరిట వైసీపీ సర్కారు దానిని రూ.7కు పెంచింది. మూడున్నర రెట్లు పెంచి పేదవర్గాలపై భారం మోపింది. కుటుంబానికి రోజుకు సగటున మూడు క్యాన్లు అవసరం. అంటే తాగునీటికి రోజుకు రూ.21 ఖర్చుచేయాల్సి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఉండడంతో ఎన్టీఆర్ సుజలధారకు పూర్వవైభవంగా వస్తుందని, తమ నీటి కష్టాలు తీరుతాయని ఉద్దానం వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదుల మేరకు బాగు చేయిస్తున్నాం

ఎన్టీఆర్ సుజలధార ప్లాంట్లు పని చేయడం లేదని ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవమే. ఫిర్యాదు వచ్చిన వెంటనే వాటిని బాగుచేయిస్తున్నాం. వీలైనంత వేగంగా పునరుద్ధరించే చర్యలు చేపడుతున్నాం.

-దుర్యోధన, డీఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పలాస



ఏకమైన హృదయాలు



నాగచైతన్యతో తన నిశ్చితార్థం ఫొటోలను శోభితా దూళిపాళ్ల సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు. ఆమె చైతూతో కలసి ఊయలలో కూర్చున్న ఫొటోలు వైరల్ అయ్యాయి. 'మన పరిచయం ఎలా జరిగితేనేం, మన హృదయాలు ప్రేమలో మమేకమయ్యాయి. విడిపోలేనంతగా అవి ఏకమయ్యాయి' అంటూ ఆమెనాగచైతన్యపై తన ప్రేమను వ్యక్తం చేశారు. నిశ్చితార్థం తర్వాత శోభిత ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన తొలి పోస్ట్ ఇదే. దీన్ని నాగచైతన్య తన ఖాతాలో రీ పోస్ట్ చేశాడు.

థియేటర్లో విజిల్స్ పడేలా... 'బచ్చన్'



నిర్మాతగా వరుస సినిమాలను నిర్మిస్తూ.. టాప్ గేర్‌లో దూసుకుపోతున్నారు టీ.జీ.విశ్వప్రసాద్. ఆయన లేటెస్ట్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు. "ఇది కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉన్న సినిమా. మాస్ ప్రేక్షకులకు విపరీతంగా నచ్చేస్తుంది. ఈ సినిమాను హరీశ్ తన మేకింగ్ స్కిల్స్‌తో ఎక్కడికో తీసుకుపోయాడు. రవితేజ, భాగ్యశ్రీ బోర్సే మధ్యన జరిగే ప్రేమకథ అలరిస్తుంది. మిక్కీజే.మేయర్ మంచి పాటలను ఇచ్చారు. ఈ సినిమా అవుట్‌పుట్ అనుకున్నదాని కంటే చాలా బాగా వచ్చింది. థియేటర్లో వచ్చే యాక్షన్ సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విజిల్స్ పడతాయి" అని చెప్పారు.

'అవతార్ 3' టైటిల్ వచ్చేసింది

'టైటానిక్', 'టెర్మినేటర్', చిత్రాలతో హాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా ఎదిగారు జేమ్స్ కామెరూన్. ఆయన తెరకెక్కిస్తున్న 'అవతార్' సిరీస్‌లో మొదటి రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త రికార్డులను నెలకొల్పాయి. మొత్తం ఐదు భాగాలుగా 'అవతార్' సిరీస్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.



తాజాగా, అందరినీ ఊరిస్తున్న 'అవతార్ 3' టైటిల్‌ను దర్శకుడు విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'ఫైర్ అండ్ యాష్'. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "ఇందులో పండోరా గ్రహాన్ని మరింత కొత్తగా చూపెడుతున్నాను. మరిన్ని అత్యద్భుత విజువల్స్ కట్టిపడేసే భావోద్వేగాలతో మూడో భాగం ఉంటుంది. మీ అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేయడానికి ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను" అని చెప్పారు. ఈ సినిమా వచ్చే ఏడాది, డిసెంబరు 19న విడుదల అవుతుంది.













నిర్లక్ష్యం

సుభద్రాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో చెత్తతో విద్యార్థులు, చిన్నారులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లేరోడ్డు ఇరువైపులా చెత్తను వేసేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలేఅవకాశం ఉందని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

-నందిగాం


పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల మధ్య రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఇబ్బందులు

పట్టణంలో ఏ రోడ్డు, ఏ ఖాళీ ప్రదేశంలో చూసినా పశువుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్లపై పశువులు తిరుగుతుండడంతో వాహన దారులు, బాటసారులు ఇక్కట్లకు గురవుతున్నారు. చీకటి పడితే చాలు రోడ్లపైనే పశువులు విశ్రాంతి తీసుకుంటున్నాయి. నరసన్నపేట మెయిన్ రోడ్డుపై సంచరిస్తూ ఇబ్బందికి గురిచేస్తుండగా బజారువీధి, కళాశాల మైదానంలోనూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. పంచాయతీ అధికారులు స్పందించి పశువులను నియంత్రించే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

-నరసన్నపేట


నరసన్నపేటలో రోడ్డుపై తిరుగుతున్న పశువులు

అవస్థలు

జలుమూరు మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రజలు, విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, ఎండ వచ్చినా, వర్షం కురిసినా తడిచే ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండలానికి చెందిన 10 గ్రామాల ప్రజలు శ్రీకాకుళం, నరసన్నపేట తదితర పట్టణాలకు వెళ్లేందుకు రోడ్లపైనే నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

-జలుమూరు



రోడ్డుపై బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

అధ్వానం

వనితమండలం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టి మధ్యలో విడిచిపెట్టడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్నికలకు ముందు రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రజా ప్రతినిధులు హడావుడి చేసి రోడ్డు తవ్వి పనులు ప్రారంభించారు. అయితే రోడ్డును తవ్వి వదిలేయడంతో రాళ్లుదేలి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-పోలాకి


రాళ్లు వేసి విడిచిపెట్టిన వనితమండలం రోడ్డు

మృతుల కుటుంబాలకు మంత్రి అచ్చెన్న పరామర్శ

కోటబొమ్మాళి: ఇటీవల అనారోగ్యంలో మృతి చెందిన పలు మృతుల కుటుంబాలకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం పరామర్శించారు. తాటిపర్తి పంచాయతీ మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ మెండ భాస్కరరావు అనారోగ్యం మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే దంత గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెలమల కృష్ణారావు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని అచ్చెన్నాయుడు పరామర్శించారు. పార్టీ నాయకులు మృతి చెందడం తీరని లోటని, వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, పలువురు నాయకులున్నారు.


మృతుల కుటుంబాలను ఓదారుస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్

మృతులకు మాజీ మంత్రి శివాజీ సంతాపం

హరిపురం: మందస మండలంలో వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ శనివారం పరామర్శించారు. సువర్ణాపురంలో దాసరి శ్రీరాములు, చిన్న బాహడపల్లిలో మాధవరావు, చిక్కిడిగాంలో డొంకూరు కిశోర్, బావనాపురంలో సవర దర్మారావు మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య రుద్రయ్య, తమిరి భాస్కరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ మంత్రి శివాజీ

ఐటీడీఏ పీవో బదిలీని నిలుపుదల చేయాలి

మెళియాపుట్టి: సీతంపేట ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్ రెడ్డి బదిలీని నిలుపుదల చేయాలని గిరిజన ఐక్యవేదిక నాయకులు సీహెచ్ శాంతరావు, చౌదరి లక్ష్మీనారాయణ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో నలుగురు పీవోలను బదిలీ చేశారన్నారు. దీనివల్ల గిరిజన సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రాహుల్‌కుమార్ రెడ్డి పీవోగా వచ్చిన వారంలోనే బదిలీ చేశారన్నారు. గిరిజన గ్రామాలపై అవగాహన కలిగించుకునే లోగానే బదిలీలు చేయడం వల్ల గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బదిలీని నిలుపుదల చేయాలని వారు కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలి

పలాస: పట్టణంలోని 27వ వార్డు భద్రం కోనేరు గట్టుపై లయన్స్‌క్లబ్ వనిత విభాగం ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, వనిత విభాగం అధ్యక్షురాలు తర్లాన శ్వేత కుమారి, కార్యదర్శి మల్లా సంతోషి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఇళ్ల ఆవరణల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక యువజన నాయకుడు గురిటి శివాజీ, కోశాధికారి తూముల గాయత్రి, మాజీ అధ్యక్షురాలు మల్లా జయశ్రీ, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న వనితా ప్రతినిధులు

రేపు శ్రీముఖలింగంలో ఉచిత కంటి వైద్యశిబిరం

జలుమూరు: శ్రీముఖలింగంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటి సమస్యలున్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలని కోరారు. పరిసర గ్రామాల రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెట్టవలసలో పారిశుధ్య పనులు

జి.సిగడాం: డయేరియా బాధితులతో నిండిపోయిన మెట్టవలస గ్రామంలో శనివారం పంచాయతీ అధికారులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. శుక్రవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యటించి గ్రామంలో పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన అధికారులు కాలువల్లో మురుగు తొలగింపు, తాగునీటి బోర్లు, నేల బావుల వద్ద శానిటేషన్, క్లోరినేషన్ చేయించారు. ఖాళీ ప్రదేశాల్లో దోమలు, ఈగల నివారణ మందు పిచికారీ చేయించారు. పలు ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను శివారు ప్రాంతానికి తరలించారు. పనులను ఈవోపీఆర్డీ ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శి ధర్మవరపు సతీష్, సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ బెవర లక్ష్మి తదితరులు పర్యవేక్షించారు.


దోమల మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

చీడివలసలో వైద్య శిబిరం

బూర్జ: చీడివలస గ్రామంలో వైద్యాధికారులు ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అన్నెపు శశిధర్, ఉపేంద్ర, షర్మిల రోగులను పరీక్షించి మందులు అందించారు. అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ ఎల్.శ్రీధర్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పి.కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

పొందూరు: రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసినట్లవుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, రెడ్‌క్రాస్ మండల కన్వీనర్ కె.శాంతారాం అన్నారు. మండల కేంద్రంలో శనివారం శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది యువకులు, వీరమహిళలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి పెంకి చైతన్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ, దండా రవి, రాజేష్, పవన్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించండి

వజ్రపుకొత్తూరు: బాతుపురం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు రోడ్డుపై పారడంతో ఇసుక నిలిచి పోయింది. దీంతో ద్విచక్ర వాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఇసుక తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


బాతుపురం రోడ్డుపై ఉన్న ఇసుక మేటలు

నాణ్యమైన భోజనం పెట్టడం లేదు

- మినీ గురుకులం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన
- హెచ్‌ఎంను తప్పించిన పీవో


నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


వంట పదార్థాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

కొత్తూరు: కారిగూడ మినీ గురుకులంలో విద్యార్థులకు కడుపునిండా భోజనం పెట్టడం లేదని, నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పిల్లలతో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. హెచ్‌ఎం హేమలతను ఇక్కడి నుంచి బదిలీ చేసే వరకు పిల్లలను పంపేది లేదని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి గురుకులానికి చేరుకొని సమస్యను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అన్యాయం జరుగుతోందని గుర్తించిన పీవో హెచ్‌ఎంను ఇక్కడ నుంచి పంపిస్తానని హామీనిచ్చారు. దీంతో వారు నిరసన విరమించుకున్నారు. వంటకాలను ఆయన పరిశీలించారు. అనంతరం పీవో హెచ్‌ఎం సవర హేమలతను విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఎస్.శ్రీలక్ష్మికి ఇన్ చార్జి బాధ్యతలను అప్పగించారు. కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవర ప్రసాద్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

హిరమండలం/కొత్తూరు: విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన హిరమండలం, కొత్తూరు పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణతో పాటు సిబ్బంది నివాస గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గంజాయి, సారా అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని ఆదేశించారు. రాత్రి గస్తీ పెంచాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎస్ఐ నారాయణస్వామి, అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.


హిరమండలంలో పోలీస్ క్వార్టర్స్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

చట్టాలపై అవగాహనతో నేరాల నియంత్రణ

జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి

పాతపట్నం: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోషిణి అన్నారు. బైదలాపురం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మండల న్యాయ సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, వాటి పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కలిగించారు. అలాగే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సదాశివ విద్యార్థులు, గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.రమణ హెచ్‌ఎం గౌరీశ్, 104, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి రోషిణి

ఎంపీడీవోకు మెమో

కోటబొమ్మాళి: ఐకేపీ భవనంలో గురువారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన ఎంపీడీవో పద్మజకు కలెక్టర్ మెమో జారీ చేశారు. వాస్తవానికి ఆ రోజు ఎంపీడీవో పద్మజ సెలవులో ఉన్నారు. అయితే ఈ కాన్ఫరెన్స్‌కు కార్యాలయం నుంచి ఏ ఒక్కరూ హాజరుకాకపోవడం, ఎవరికీ బాధ్యత అప్పగించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేస్తూ ఈ మెమో జారీ చేసినట్లు సమాచారం.

నేడు జీడి కార్మికుల సమావేశం

పలాస: జీడి కార్మికుల కార్యవర్గం ఎంపిక జరగనున్న నేపథ్యంలో ఆదివారం కార్మిక భవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పలాస ప్రాంత జీడి కార్మికులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

యువతకు కూటమి ప్రభుత్వం అండ

నరసన్నపేట: యువతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం కోమర్తిలోని ఓ కల్యాణ మండపంలో కొల్లి రాంబాబు ఆధ్వర్యంలో పేద నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు తొలిసంతకం చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. రానున్న రోజుల్లో యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ట్రైనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాథం, పంచిరెడ్డి సత్యం తదితరులు పాల్గొన్నారు.


డీఎస్సీ మెటీరియల్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవం

- ఉద్యమ స్ఫూర్తితో పనిచేయాలి
- సంఘ నేతల పిలుపు

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సంఘ పతాకాలను నేతలు ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి 50 ఏళ్లుగా యూటీఎఫ్ పనిచేస్తోందని, భవిష్యత్‌లోనూ ముందు ఉంటుందన్నారు. ఉద్యమ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ఆ సంఘ నేతలు, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పలాసరూరల్: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జెండా ఎగురువేస్తున్న యూటీఎఫ్ సభ్యులు


వజ్రపుకొత్తూరులో..


నందిగాంలో..


రణస్థలంలో..


కంచిలిలో పతాకానికి వందనం


నరసన్నపేటలో..


టెక్కలిలో..

గురుకులంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

హరిపురం: రాధాకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఖాళీగా ఉన్న మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి శనివారంఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరి 47, ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఎస్సీ 9, ఓసీ కేటగిరి ఒకటి చొప్పున సీట్లు ఖాళీలున్నాయన్నారు. అర్హులైన వారు కళాశాలలో సోమవారం ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.

నందిగాం గురుకులంలో..

నందిగాం: నందిగాం డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీ 49, ఎస్టీ రెండు, బీసీ, ఓసీ ఒక్కో ఖాళీలున్నాయన్నారు. ఆరో తరగతిలో ఎస్సీ 34, బీసీ, ఓసీ ఒక్కొక్కటి, ఏడో తరగతిలో ఎస్సీ తొమ్మిది, ఎస్టీ, ఓసీ ఒక్కొక్కటి, ఎనిమిదో తరగతిలో ఎస్సీ 22, ఓసీ ఒకటి, తొమ్మిదో తరగతిలో ఎస్సీ 23, ఎస్టీ, బీసీ, ఓసీ ఒక్కొక్కటి, ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీలో ఎస్సీ 18, ఓసీ ఒక్క సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు సర్టిఫికెట్లతో సోమవారం హాజరు కావాలని కోరారు.

సమావేశ మందిరం నిర్మించాలి

పోలాకి: పోలాకి పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ, సిబ్బందితో సమావేశాల నిర్వహణకు సమావేశ మందిరం నిర్మించాలని వైద్యాధికారి శ్రీనాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ ముద్దాడ దమయంతి బైరాగి నాయుడు, ఎంపీడీవో కె.ఉషశ్రీని కలిసి వినతిపత్రం అందించారు. మండల పరిషత్ నిధులు మంజూరు చేయాలని వారు కోరారు.

ధ్రువపత్రాల నకళ్లను అందజేయాలి

వెదుళ్లవలస(పోలాకి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్న రైతుల ఖాతాల వివరాలు కంప్యూటరీకరణకు అవసరమైన ధ్రువపత్రాల నకళ్లను అందజేయాలని సీఈవో బి.రాంబాబు కోరారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. పట్టాదార్ పాస్ పుస్తకం, వన్‌బీ, ఆధార్, రేషన్, పాన్‌కార్డు, డీసీసీబీ అకౌంట్ బుక్ జిరాక్సు కాపీలతో పాటు మూడు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, ఫోన్ నెంబర్ అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9642566760 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

నరసన్నపేట: కలివరపుపేట షిర్డీసాయి మందిర వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి, గణేష్ విగ్రహాలకు రెండున్నర కేజీల వెండితో తయారు చేసిన కిరీటాలను భక్తులు అందించారు.



చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


కొల్ల సూరి(ఫైల్)

నరసన్నపేట: నడగాం గ్రామానికి చెందిన కొల్ల సూరి అలియాస్ సూర్యనారాయణ(71) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సూర్యనారాయణ మానసికంగా కలత చెంది శుక్రవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. సూర్యనారాయణకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య అమ్మాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సరుబుజ్జిలి: నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. డే బీట్, నైట్ బీట్ గస్తీ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రం, పలు గదులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఎస్‌ఈబీ విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్

కంచిలి: గంజాయి వంటి మాదక ద్రవ్యాలును అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ అన్నారు. శనివారం సోంపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా అరికట్టడంలో భాగంగా కంచిలి మండలం జాడుపూడి కాలనీ జంక్షన్ హైవే వద్ద ఒడిసా నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. వీటితో పాటు కంటైనర్లు, ఇతర భారీ వాహనాలను పరిశీలించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సిబ్బంది మోహన్‌రావు, నాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు నిరుపమానం

కలెక్టరేట్: పారిశుధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రి, జెమ్స్ ఆసుపత్రి శనివారం సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొవిడ్ సమయంలో మాత్రమే కాకుండా అన్ని వేళల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతున్న వీరంతా దైవ సమానులని అన్నారు. అన్ని విధాలా వీరికి అండగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ చల్లా ఓబులేసు, జెమ్స్ ఆర్ఎంవో ప్రవీణ్‌కుమార్, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు ఐ.భాస్కరరావు తెలిపారు. పెద్దపాడులోని రెయ్యమ్మ తల్లి వ్యాయామ శాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏటా క్రమం తప్పకుండా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది మునసబుపేటలో గల గురుజాడ విద్యాసంస్థల కళా ప్రాంగణంలో 38వ పురుషుల, 23వ మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ కేటగిరీలో పోటీలు నిర్వహించనుండగా, ఒక్కొక్క గ్రూపునకు పది కేటగిరీలో పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో గెలుపొందిన వారికి పతకాలతోపాటు స్ట్రాంగ్ మెన్, స్ట్రాంగ్ ఉమెన్ ప్రకటిస్తామన్నారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెలాఖరులో అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సుమారు వందకు పైగా క్రీడాకారులు పాల్గొంటారని, వచ్చిన క్రీడాకారులకు భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ పోటీలకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మీతోపాటు సంఘ ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొంటారన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కమిటి సభ్యులు, శిక్షకులు ఇప్పిలి అప్పన్న, మాజీ కార్యదర్శి కె.మధు, సీనియర్ క్రీడాకారులు ముద్దాడ సూర్యారావు, హిమగిరిలు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన నగర టీడీపీ అధ్యక్షుడు


మంత్రి అచ్చెన్నతో కరచాలనం చేస్తున్న మాదారపు వెంకటేష్

అరసవల్లి: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ నిమ్మాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. ప్రజలు, కార్యకర్తలతో మమేకమై శ్రమిస్తున్న నాయకుడు మన అచ్చెన్న అని, రాష్ట్రం, జిల్లా అభివృద్ధికి పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. అచ్చెన్నను కలిసిన వారిలో నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణరావు, కోశాధికారి సతీష్‌బాబు, బీసీ సెల్ అధ్యక్షుడు ఉంగటి వెంకటరమణ, పార్టీ నాయకులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీఐ పైడపునాయుడు

శ్రీకాకుళం క్రైం: యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అనవసరపు లింక్‌లు ఫోన్లో ఓపెన్ చేయడం వల్ల ఆర్థికంగా, వ్యక్తిగతంగా నష్టపోతారని శ్రీకాకుళం సీఐ కె.పైడపు నాయుడు అన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు రూరల్ మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థులకు సైబర్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, గుడ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్ నియంత్రణ వంటి వాటిపై సీఐ అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపటం చట్ట రీత్యా నేరమని, మైనర్లుకి వాహనాలిస్తే తల్లిదండ్రులతో పాటు, వారికి వాహనాలిచ్చే వారిపై కూడా కేసులు పెడతామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా లక్ష్య సాధన దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సీఐ సూచించారు.


నందిగాం: వర్మీ కంపోస్ట్ తయారీని పరిశీలిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు


రణస్థలం: మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

- పీఆర్ ఏసీ కృష్ణమోహన్
- ముగిసిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ

రణస్థలం: సర్పంచ్‌లు, కార్యదర్శులు అవగాహనతో కలిసి పనిచేస్తూ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్పంచ్‌ల శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు పిన్నింటి వెంకటభానోజీరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీయం చేసిందని, సర్పంచ్‌లకు గౌరవం లేకుండా చేసిందన్నారు. అదుపుతప్పిన పంచాయతీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

● పలాస రూరల్: పంచాయతీల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. పంచాయతీల్లో ఆర్థిక వనరుల బలోపేతం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వ హణ, శానిటేషన్, వీధి దీపాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీడీవో ఎం.వైకుంఠరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● కోటబొమ్మాళి: త్వరలో విడుదల కానున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీవో వై.పద్మజ అన్నారు. పంచాయతీల అభివృద్ధిపై మూడురోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణారావు పంచాయతీలోని రాజకీయ సమస్యలపై ప్రశ్నించగా మీ మాటలు రికార్డ్ చేసి సస్పెండ్ చేస్తానని ఎంపీడీవో పద్మజ అనడంతో కృష్ణారావుతో పాటు కొత్తపేట పంచాయతీ కార్యదర్శి నిర్మల కలుగుచేసుకొని పదేపదే ప్రతి ఒక్కరినీ సస్పెండ్ చేస్తాననడం సబబుకాదని, గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు విని పరిష్కరించాలే తప్ప ఇలా హెచ్చరించడం మంచిదికాదన్నారు. ఒక అధికారిగా మీ పద్ధతి మార్చుకోవాలంటూ నిరసన తెలిపారు. దీంతో ఈవోపీ ఆర్డీ బి.రామారావు కలుగజేసుకొని శిక్షణను కొనసాగించారు.

● పోలాకి: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఎంపీడీవో కె.ఉషశ్రీ, సూపరిం టెండెంట్ బలగ ప్రకాష్ నేతృత్వంలో ఈ తరగతులు నిర్వహించారు. చెత్తసంపద, పరిసరాల పరిశుభ్రతపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

● ఎల్ఎన్ పేట: పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో జి.గిరిబాల అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యద ర్శులకు శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. పంచాయ తీల అభివృద్ధికి ప్రభుత్వం 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు విడుదలచేయడం జరుగుతుం దన్నారు. ఈ నిధులతో మౌలిక వసతుల కల్పన చేపట్టాలన్నారు. జడ్పీటీసీ కె.త్రినాథులు, ఈవోపీఆర్డీ పద్మజ ఉన్నారు.

● జలుమూరు: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లే పట్టుకొమ్మలని ఎంపీపీ వాన గోపి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. పంచాయతీల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● నందిగాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఎంపీడీవో టి.రాజారావు ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనీలు కె.సంతోష్ కుమార్, డిల్లేశ్వరరావులు పంచాయతీల అభివృద్ధి, నిర్వాణపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీల ఆర్థిక పురోగతికి చెత్త సేకరణ కేంద్రాలను వినియోగించాలన్నారు.


సరుబుజ్జిలి: చివరి రోజు శిక్షణలో పాల్గొన్న ఒకే ఒక్క సర్పంచ్ (వృత్తంలో)

● కంచిలి: గ్రామ పంచాయతీల పరిధిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో వి.నీరజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్డీ ఇ.రాంబాబు, సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

ఒక్క సర్పంచే..

● సరుబుజ్జిలి: సర్పంచ్‌లు, కార్యదర్శులకు గత మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. అయితే మండలంలో 21 మంది పంచాయతీ సర్పంచ్‌లు ఉండగా.. కేవలం రావివలస పంచాయతీ సర్పంచ్ మాత్రమే హాజరయ్యారు. కనీసం ఈ మూడు రోజులు పది మంది సర్పంచ్‌లు కూడా హాజరైన దాఖలాలు లేవు. శిక్షణ ఆశించిన స్థాయిలో లేకపోవడమే కారణంగా సర్పంచ్‌లు చెబుతున్నారు. మరోవైపు ప్రతి సర్పంచ్‌కు శిక్షణకు హాజరయ్యేందుకు అందించాల్సిన భృతి కూడా ఇవ్వలేదంటూ ఆరోపణలు వస్తున్నాయి.

ఏవో తీరుతో శిక్షణ బాయ్‌కాట్

శ్రీకాకుళం అర్బన్: మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా సర్పంచ్‌లకు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణలో మాటల యుద్ధం నడిచింది. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గడిచిన మూడు రోజులుగా శిక్షణా తరగతులు నిర్వహించారు. శనివారం చివరి రోజు గ్రామాల్లో చెత్త సేకరణ, పరిపాలన పరమైన సమస్యలు, ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు నిర్వాహణపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం భోజన సమయం కావడంతో అప్పుడే సమావేశానికి వచ్చిన ఎంపీడీవో కార్యాలయ ఏవో రఘు అక్కడకు చేరుకుని సర్పంచ్‌లు, కార్యదర్శులు కొంత మంది ఆలస్యంగా రావడంతో భోజనానికి వస్తారా అంటూ తిట్ల పురాణం పటించారు. దీంతో భైరివానిపేట, రాగోలు, గూడెం సర్పంచ్‌లు, కార్యదర్శులు సాయంత్రం వరకు జరగాల్సిన శిక్షణను బాయ్‌కాట్ చేశారు. దీంతో మండల కార్యాలయంలో గందరగోళం నెలకొంది. ఏవో అవమానిస్తు మాట్లాడడం తగదని శిక్షణ కేంద్రానికి వచ్చిన వారంతా గుసగుసలాడారు.

బ్రిడ్జిని తాకిన గుర్రపుడెక్క

● ప్రమాదకరంగా వంశధార కుడి కాలువ


వంశధార కుడి కాలువపై గల బ్రిడ్జి (ఏబీ రోడ్డు) వద్ద ప్రమాదకరంగా ఉన్న గుర్రపు డెక్క

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలి సమీపంలో ఉన్న వంశధార కుడి ప్రధాన కాలువ ప్రమాదాన్ని తలపిస్తుంది. సరుబుజ్జిలి జంక్షన్ సమీపంలో కాలువ 15-ఎల్ నుంచి 16-ఎల్ మధ్య ప్రాంతంలో నీటి ప్రవాహాన్ని గుర్రపు డెక్క అడ్డుకోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. ఆలికాం-బత్తిలి రహదారి జంక్షన్ సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద భారీగా గుర్రపు డెక్క నిలిచిపోవడంతో ప్రమాదకరంగా మారింది. నీటి ప్రవాహం స్తంభించి ఏ క్షణాన కాలువ గట్టుకు గండి పడుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడి గుర్రపు డెక్క తొలగించాలని లేకుంటే గండి పడే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సందడిగా ఎమ్మెల్యే అశోక్ జన్మదినం


కవిటి: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

కవిటి: రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఇంటి వద్ద ఆయన జన్మదిన వేడుకలు కూటమి నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దీంతో ఎమ్మెల్యే నివాసం వద్ద కోలాహలం నెలకొంది. ఎమ్మెల్యే దంపతులు రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం: ఎమ్మెల్యే బెందాళం అశోక్ జన్మదిన వేడుకలు శనివారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నాయకులు కాళ్ల దిలీప్, పత్రి తవిటయ్య, సాలిన డిల్లీయాదవ్, నంది, కాళ్ల అర్జున, కాళ్ల జయదేవ్, కె.నాగరాజు, సహదేవ్‌రెడ్డి, గౌరి తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే బెల్లుపడ 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెయ్యి జానకిరావు సీతయ్య ఫౌండేషన్‌కి వెళ్లి ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, విద్యార్థులకు భోజనం, స్వీట్స్ అందించారు.

● కంచిలి: ఎమ్మెల్యే బెందాళం అశోక్ పుట్టిన రోజు సందర్భంగా మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి, విజయదుర్గా మెడికల్ వారి సౌజన్యంతో కంచిలిలో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ కార్యకర్తలు కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మద్దిల కేశవయ్య, మద్దిల ఆనంద్, మద్దిల భాస్కరరావు, గుమ్మడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: పంద్రాగస్టు సందర్భంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగ్ యువజన సర్వీసుల శాఖ, నెహ్రూ యువ కేంద్రం, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏడు రోడ్ల జంక్షన్ నుంచి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం ధారపోసిన త్యాగధనుల జీవితాలను స్ఫూర్తిగా నేటి యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ చల్లా ఓబులేసు, డీఎస్‌డీవో శ్రీధర్, పర్యాటకాధికారి నారాయణరావు, ఎన్‌వైకే వెంకట్ ఉజ్వల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి


పాడై పోయిన రోడ్డు

గార: వాడాడ పంచాయతీ రెడ్డిపేట నుంచి శ్రీకాకుళం మండలం వప్పంగి గ్రామం వరకు ఉన్న గ్రావెల్ రోడ్ గోతులతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. గత కొన్నేళ్ళుగా ఈ రోడ్డు ఎటువంటి మరమ్మతులు లేక పాడై అధికారులు ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: క్రీడాకారులు చురుకుదానానికి స్విమ్మింగ్ ఎంతగానో దోహదపడుతుందని, క్రీడల్లో రాణించినట్టయితే ఆయా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని శాంతినగర్ కాలనీలోగల స్విమ్మింగ్ పూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీల ప్రారంభోత్సంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈత ద్వారా శరీరంలో అన్ని అవయవాలకు వ్యాయామం ఉంటుందని, తద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారన్నారు. ఇక్కడ పాల్గొన్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటి జిల్లాకు కీర్తిని తీసుకురావాలన్నారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి అసోసియేషన్లు చేస్తున్న కృషి వర్ణానాతీతమన్నారు. మొదటి రోజు క్రీడాకారులకు ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, బెస్ట్ స్ట్రోక్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ఎస్‌పీ ప్రసాద్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి జాన్సీ, అంధవరపు సంతోష్, వావిలాపల్లి జగన్నాథంనాయుడు, శిక్షకులు కాంతారావు, మురళి, చక్రవర్తి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

గుజరాతీపేట: రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు 21మంది చనిపోయారని, ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నారని, కారుణ్య నియామకాల ద్వారా పోస్టులు భర్తీ చేయాలని ఏపీఎంఎస్ ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఓ హోటల్‌లో జరిగిన ఏపీ మోడల్ స్కూల్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్య క్షులు మునిరత్నం, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, కార్యదర్శి వెంకట కృష్ణారెడ్డి, సీహెచ్ రామారావు, బి.శ్రీనివాస్‌రావు, బి.సత్యనారాయణ, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక కట్టడంగా గుర్తించాలి


కళింగపట్నంలో బ్రిటీష్ కాలం నాటి భవనం

గార: కళింగపట్నంలో గ్రామ సచివాలయం పక్కనే ఉన్న పూర్వపు పశువైద్యశాల భవనాన్ని చారిత్రక కట్టడంగా గుర్తించాలి అని పలువురు సంబంధిత అధికారులను కోరుతున్నారు. బ్రిటిష్ కాలం నాటి ఈ భవనంలో అప్పట్లో ఈ ప్రాంతానికి ఖజానాగా వినియోగించేవారిని స్థానిక పెద్దలు అంటున్నారు. అటు తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ భవనం పశువైద్యశాలకు ఉపయోగించారు. ఈ భవనం కూడా పై కప్పు ఊడిపోవడం, గోడలు బీటలు వారిన నేపథ్యంలో ఆ పక్కనే పశువైద్యశాల కోసం కొత్త భవనం నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. వందేళ్ల కిందట బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ భవనం చారిత్రక కట్టడంగా గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు.

పశువుల పట్టివేత

ఇచ్ఛాపురం: ఒడిసా రాష్ట్రం కేదారిపురం నుంచి ఆంధ్రాలోకి వ్యాన్‌లో తలరిస్తు న్న పశువులను రూరల్ ఎస్‌ఐ లక్ష్మణరావు పట్టుకున్నారు. రాత్రి గస్తీలో భాగంగా వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. శనివారం వేకువ జామున వ్యాన్‌లో తరలిస్తున్న 22 గేదెలు, 11 ఆవులు, మూడు దూడలను పట్టుకొని గోశాలకు తరలించటంతో పాటు వ్యాన్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ మెట్ట అమ్మినాయుడు ప్రజలకు సూచించారు. శనివారం పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధి తిమ్మాపురంలో ప్రజలకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ఫలానా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఏటీఎం పిన్ నెంబర్, బ్యాంకు అకౌంట్ వివరాలను అడిగితే వివరాలు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు, ఆర్పీలు రాజ్యలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

13న మిగులు సీట్ల భర్తీకి పరీక్ష

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీల భర్తీకి పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీచేస్తామన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్లను పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు నిర్దేశించిన రోజు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలు, పదో తరగతి (ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ కోసం) హాజరుకావాలన్నారు. 5వ తరగతిలో ఎస్సీ 6, ఎస్టీ 3, 6వ తరగతిలో ఎస్సీ 5, ఎస్టీ 2, 7వ తరగతిలో ఎస్టీ 2, 8వ తరగతిలో ఎస్సీ 4, ఎస్టీ 1 సీట్లు ఖాళీ ఉన్నట్టు వివరించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎస్సీ 6, ఎస్టీ 1 సీటు ఉన్నాయన్నారు.

విగ్రహ ధ్వంసంపై నిరసన

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో నిరంకుస పాలన నశించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహాశిల్పంపై దాడిని నిరసిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాతకు జరిగిన అవమానాన్ని ప్రజాస్వామ్య ఖూనీగా భావిస్తున్నామన్నారు. శనివారం రాత్రి పాత బస్టాండ్ జంక్షన్ వద్ద నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తూ మార్కెట్ జంక్షన్, దాసన్నపేట మీదుగా బస్టాండ్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు

● కంచిలి: విజయవాడలో బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడానికి నిరసనగా కంచిలిలో ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వజ్జ మృత్యుంజయం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● రణస్థలం: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రమైన రణస్థలంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో మూడు మండలాల వైసీపీ కార్యకర్తలు పాల్గొని నిరసన చేపట్టారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఆమదాలవలస: మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సీఐ వాయునందన్ దివాకర్ యాదవ్ అన్నారు. శనివారం తాళ్లవలస వద్ద ఉన్న కేజీబీవీలో విద్యార్థులకు మత్తు పదార్థాలు వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేష్, కేజీబీవీ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.